


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**తుగ్లకా బాద్‌లో** ఓ ప్రాంతమంతా నేలలో కృంగిపోయి 8 వేలమంది మృతి. ఝాన్సీ ప్రాంతంలోనూ ఆకస్మికంగా ఇళ్ళు కూలి 5వేలమంది మృతి .మధ్యప్రదేశ్ రివైన్స్‌లో రెండు రైళ్ళు ఢీకొని 600మంది మృతి. బికనీర్‌లో భూకంపం. మృతుల సంఖ్య తెలియలేదు. బంగ్లాదేశ్ భారత్ బోర్డర్‌లో పిడుగుల వర్షం. మృతుల సంఖ్య తెలియరాలేదు" న్యూస్ పేపర్ చదువుతూనే ఉంది.

తిరువణ్ణామలైలో మహదేవన్ ఇంటివద్ద జయ్, దద్లానీ, గోర్కీ, స్టిట్సన్, రజోవ్‌స్కీ, డాంటే, శమంతో, రాబీ, ప్రవస్థి అందరూ షాక్‌తో న్యూస్ వింటున్నారు.

"మైగాడ్.. ఢిల్లీ దృశ్యాలు పునరావృత్తమౌతున్నట్టు ఉంది. అసలెందుకు జరుగుతున్నాయీ? ఏమైనా విద్రోహ చర్యలా? పొరుగు దేశాలు సృష్టిస్తున్న అరాచకమా?" షాక్‌తో అన్నాడు మహమ్మద్ అతీం.

"అలాగే ఉంది" కనుబొమలు ముడేసి అన్నాడు శమంతో.

"ప్రళయం అంటే అన్ని దేశాల్లోనూ ఉండాలిగానీ కేవలం భారతదేశంలోనే యీ ఉపద్రవాలు ఎందుకొస్తాయీ?" సాలోచనగా అన్నాడు గోర్కీ.

"యదాయదాహి ధర్మ స్య గ్లా నిర్భవతి భారత" శ్లోకం విన్నావుగా, 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అనే శ్లోకం, అదే, 'పరిత్రాణా తో సాధూనాం, వినాశాయ చదుష్కృతం ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అన్న శ్లోకం" చిన్నగా అన్నారు మహదేవన్.

"విన్నాను. దానికీ దీనికీ సంబంధం ఏమిటీ?" అడిగాడు గోర్కీ.

"ఇన్ని యుగాల్లోనూ భగవంతుడు అవతరించింది ఎక్కడ? ఇక్కడేగా! రష్యాలోనో అమెరికాలోనో ఆస్ట్రేలియాలోనో కాదుగా! ధర్మానికి హాని కలిగిందీ, కలుగుతున్నదీ, కలిగేదీ కూడా యీ పుణ్య భరతభూమిలోనే. అందుకే భగవంతుడి అన్ని అవతారాలూ ఇక్కడే ధరించవలసి వచ్చింది. నిజం చెబితే, యీ లోకానికే మనదేశం సాంస్కృతిక, జ్ఞాన, వైరాగ్య, విజ్ఞాన కేంద్రం. అన్నీ ఇక్కడే పరిమమళించి ఇతర దేశాలకు తీసుకు వెళ్ళబడతాయి. అందుకే, మన దేశానికి ముప్పు ఎప్పుడూ పొంచే ఉంటుంది. కానీ నాయనా, అవతార పురుషులు అవతరించి ఆ ధర్మగ్లానిని తొలగించడమూ మనకి తెలిసినదేగా! నిర్భయంగా, నిశ్చింతగా ఉండండి!" మెల్లగా అన్నారు మహదేవన్.

"జరుగుతున్న ఘోరాల్ని చూస్తూ నిర్భయంగా, నిశ్చింతగా ఎలా ఉండగలం?" కోపంగా అన్నాడు అతీం.

"మరేం చేద్దాం? భయభ్రాంతులమై మరిన్ని ఘోరాలు జరగడానికి కారణమవుదామా? యంగ్ మేన్, యీ జరిగిన సంఘటనలనీ, ఒక్క ట్రైను ప్రమాదం తప్ప మిగతావన్నీ మానవసృష్టి అని తేలలేదు. భూమి కృంగిపోవడం, పిడుగులు పడటం, ఇళ్ళు కూలడం, భూకంపం ఇవన్నీ ప్రకృతి వైపరీత్యాలే. ఒక విధంగా చెబితే మానవుడు చేజేతులా చేసుకున్న ప్రకృతి ధ్వంసానికి ప్రత్యేక సాక్ష్యాలే. అందుకే ఇది ఎవరికి వారు గుండెమీద చెయ్యి వేసుకుని ఆలోచించవలసిన విషయం. ప్రకృతితో మనం ఎలా ప్రవర్తించాలో సజావుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవలసిన సమయం. భయం ఉన్నా బాధ ఉన్నా సరైన నిర్ణయాలకి రాలేము. చూద్దాం. ఇప్పుడు ఇవి కేవలం సంకేతాలే" నిట్టూర్చి అన్నాడు మహదేవన్.

గౌరీ లక్ష్మి (మహదేవన్ భార్య) పరిమళ (కూతురు) వేడి వేడి కాఫీని చక్కని పింగాణీ కప్పుల్లో తెచ్చి అందరికి ఇచ్చారు. టివీలో ఏదో సినిమా వస్తోంది. మహదేవన్ దాన్ని ఆఫ్ చెయ్యబోతూ, మనసు మార్చుకుని సౌండ్ తగ్గించాడు.

"ఎంతకాలం ఇలా మనం పనీపాటూ లేకుండా విసుగుతో ఎదురు చూడాలీ?" చాలా డిస్టర్బ్‌డ్‌గా అన్నాడు రాబీ.

"విషయం ఏమిటీ?" అడిగాడు మహదేవన్.

"సంక్షిప్తంగా వివరించాడు గోర్కీ. అతనికి తెలియని తక్షపురం విషయాలూ తిరుపతి వివరాలు వివరించాడు జయ్. ఇనుప ముక్కుల గద్దల గురించీ, తపతీ నదీ తీరంలో జరిగిన పశు నష్టం గురించీ, తాము చేపట్టిన కార్యక్రమం గురించీ వివరించాడు సచేత్ దద్లానీ.

అంతా విని నిట్టూర్చాడు మహదేవన్. కొన్ని నిముషాలు మౌనం రాజ్యం చేసింది. "మీరేమంటారు?" అడిగాడు శమంతో.

"తుఫానులు, భూకంపాలు, సునామీలూ, అగ్నిప్రమాదాలు, ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు మనకీ, ఈ భూమండలానికీ కొత్తవి కావు. మానవుల అహంకారం వల్ల ఉత్పన్నమయ్యే యుద్ధాలు, అణ్వాస్త్ర ప్రయోగాలు, గూఢచారులు సృష్టించే కుల మత విద్వేషాలు కూడా కొత్తవి కాదు. అయ్యా, కథంతా మొదలైంది విమానంలో.. రాబ్ వెబ్‌స్టర్ పక్కన కుర్చున్న వ్యక్తి ఇండియా గురించి ఎడతెరిపిలేకుండా మాట్లాడటం.

మిస్టర్ రాబీ.. ఆ వివరాలు, అంటే, అతను మాట్లాడిన మాటలు మీకు గుర్తుంటాయని అనుకోను" అన్నాడు మహదేవన్.

"యస్.. గుర్తులేదు. గుర్తు తెచ్చుకోవాలనే కోరికా లేదు" చిరాగ్గా అన్నాడు రాబీ.

"గోవంద రాజస్వామి దగ్గర జరిగింది కూడా మీకు గుర్తు ఉండి ఉండదు. గుర్తు చేసుకునే ప్రయత్నం చేసినా, దానివల్ల పెద్ద ఫలితం ఉండదు" మెల్లగా అన్నాడు మహదేవన్.

"యస్.. అదేకాదు, విలియమ్స్ నన్ను ఆవహించడం కూడా ఓ కలలా ఉంది. ఒక్కటి మాత్రం నిజం. నేను నాలా లేను" ముక్తసరిగా అన్నాడు రాబీ.

"సరే. కథ అక్కడ మొదలై, ఏళుమలై అనే డ్రైవర్ రూపంలో కనబడటం లేదా వినబడటం, ఆ తరువాత స్పృహలోలేని రాబీకి శాస్త్రిగారు, సుదర్శన్, మీరూ శుశ్రూష చెయ్యడం.. ఇవన్నీ రుజువున్న విషయాలు. అంటే సాక్షులున్నారు. తక్షపురంలోని సర్పశిల గురించి జనం మాట్లాడుకోవడమేగానీ, దానికీ రాబీ కథకీ డైరెక్టుగా ఏ సంబంధమూ లేదు. ఇన్‌డైరెక్టుగా ఉందో లేదో కూడా ప్రస్తుతానికి నిర్ధారణకి రాలేము" తనలో తను మాట్లడుకుంటున్నంత మెల్లగా అన్నారు మహదేవన్. అందరూ వింటున్నారు. "సరే.. ఉందనే అనుకుందాం. ఉంటే అతని పాత్ర ఎటువంటిదీ? గత జన్మలో రాబీ బ్రాహ్మణుడు. అతని తండ్రి గోవిందరాజు స్వామి ఆలయంలో పనిచేసేవాడు. అంతమటుకూ ఓకె. మరి యీ జన్మలో ఆ జన్మ విషయం గుర్తుకురావడానికి కారణం ఏమిటీ?" ఓ క్షణం ఆగాడు మహదేవన్.

"అన్నీ ప్రశ్నలే మహదేవన్ సార్. అంతేకాదు.. నల్లమల అడవుల్లో ఓ విశ్వశాంతి యాగం జరిగింది. ఓ వెలుగులు చిమ్ముతున్న అద్భుతమైన పాషాణం వారికి లభించింది. వాటి రహస్యాలేమిటో అక్కడే ఉంటానన్న సంకల్పానందగారిని కలిస్తేకానీ తెలియదు. రాబీ కలవరించడం మహాభారతకాలం నాటి ఆయుధాలు' అని. వాటి ప్రస్థావన ఇప్పుడు ఎందుకొచ్చిందీ? వారూ యీ రాబోయే ప్రళయంలోనో, వైపరీత్యంలోనూ భాగస్వాములా? అయితే ఎవరూ? కౌరవులా?

పాండవులా? వారితో సంభవామి యుగే యుగే అని మాట ఇచ్చిన శ్రీకృష్ణులవారు కూడా ఉంటారా? అంతా అయోమయం అనిపిస్తోంది" అన్నాడు జయదేవ్.

"ఏదన్నా జరగొచ్చు.. ఎలాగన్నా జరగొచ్చు. కానీ, ప్రశాంతంగా ఆలోచించడం సాధన చెయ్యాలి. ఎందుకంటే, ఏ మహావిపత్తు అయిన మన తెలివి తేటలతో ఆపగలం అనుకోవడం తప్పు. మానవ ప్రయత్నానికి దైవబలం తోడయినప్పుడే విజయం సాధించగలం" అన్నారు మహదేవన్.

"అవ్‌కోర్స్" అన్నాడు మహమ్మద్ అతీం. "ఇన్షా అల్లా" అని అల్లాకి సలాం చేస్తూ.

"సో.. మన తరవాతి కర్తవ్యం?" అడిగాడు దద్లాని.

"ఇటునించి ఇటే తిరుపతికి పోవచ్చు. ఇక్కడినించి మద్రాస్‌కీ, మద్రాస్‌నించి తిరుపతి కంటే! అలాగే శ్రీకాళహస్తి వాయులింగాన్నీ దర్శించుకోవచ్చు. అన్నిటికన్నా ముఖ్యం శాస్త్రిగారినీ, యజ్ఞప్పనీ, రామజోగిని కలిస్తే లేటెస్ట్ విషయాలు తెలుస్తాయి. ఒక జనరల్ మీటింగ్‌లా పెట్టుకుంటే మన ఆలోచనలన్నీ కలబోసుకోవచ్చు" అన్నాడు జయ్.

"డన్.. అలాగే చేద్దాం. తెల్లకి తెల్లవారు ఝామునే గిరి ప్రదక్షిణం కూడా పూర్తి చేసుకుంటే, పుణ్యం, పురుషార్థం కూడా చక్కగా ఫలిస్థాయి" అన్నాడు శమంతో భట్టాచార్య. అందరూ ఓకె అన్నారు.

"చెప్పండి బాబాయ్" వినయంగా అన్నాడు sp వాసుదేవ్ జయా ముస్తఫర్‌తో.

"మా పూర్వీకుల ఇల్లు 'షౌకత్' తప్ప చుట్టుపక్కల ఇళ్ళూ, భవనాలూ అన్నీ కూలిపోయాయి. పుట్టిన బిడ్డకు నిర్మల్ త్యాబ్జీ అనే మంత్రసాని 'శకుని' అనే పేరు పెట్టిందిట. ఆ బిడ్డ 143వ బిడ్డ మా వంశంలో. మా పూర్వీకులు హుంజామీర్ హుస్నా మీర్ కాలం చేశారని కబురొచ్చింది. వాసూ, నేనూ ఎక్కువకాలం బ్రతకను. ఒకటి మాత్రం నిజం. అల్లకల్లోలాలు రేపుతున్న వారు ఇక్కడి వారు కాదు. భయంతోనో, ధనాశ చూపో ఇక్కడి వాళ్ళని లోబరుచుకుని ఆటలాడుతున్నారు. బేటా.. దేనికీ తొందరపడకు.. దుష్టుల్ని దండించు. అమాయకుల్ని రక్షించు. ఎందుకో నిన్ను కళ్ళారా చూడాలనిపించింది. పుండరీకాక్షుడికి నా సలాం చెప్పు.. బెహన్ సౌభాగ్యలక్ష్మి కి ఆశీస్సులు చెప్పు" అంటూనే తన మెడలో ఉన్న వెండి గొలుసుని వాసుదేవ్ మెడలో వేశాడు. దానికో రాగి తాయెత్తు వేళ్ళాడుతోంది. గొలుసు వేశాక మౌనంగా కళ్ళు మూసుకున్నాడు జియాముస్తఫిజుర్.

ఆయన పాదాలకి నమస్కరించి మౌనంగా బయటికి వచ్చాడు వాసుదేవ్. అచ్యుత్ జీప్ స్టార్ట్ చేశాడు.

"గులాబోని కలవాలి" మెల్లగా అన్నాడు వాసుదేవ్.

"యస్సర్" గులాబో టీ దుకాణం వైపుకి జీపు మళ్ళించాడు అచ్యుత్.

జీపుని చూడగానే గబగబా పరిగెత్తుకొచ్చింది గులాబో.

"ఏమైనా విశేషాలున్నాయా? టీ కలుపుతూ మాట్లాడు." జీపు దిగి దుకాణం దగ్గమన్న ప్లాస్టిక్ స్టూలు మీద కూర్చుని అన్నాడు వాసుదేవ్.

చుట్టుపక్కల దుకాణాల వాళ్ళంతా షాక్ తిన్నారు. ఓ sp టీ స్టాల్ దగ్గర స్టూల్ మీద కూర్చోడమా!

"అచ్యుత్.. అరగంటసేపు మనం ఇక్కడే ఉంటాం. జీపు పక్కనే పార్క్ చెయ్.. అందరికీ తెలియాలి. మనం ఇక్కడే కూర్చుని ఉన్నట్టు" మెల్లగా ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు వాసుదేవ్.

"యస్సర్" సెల్యూట్ కొట్టాడు అచ్యుత్.

"అంతేకాదు. మఫ్టీలో ఉండే మనవాళ్ళని అలర్ట్ చెయ్యమను. స్టేషన్ ఎస్.ఐకి వాకీటాకీలో చెప్పు" తీరిగ్గా స్టూల్ మీదే కూర్చున్నాడు sp వాసుదేవ్.

"సార్ అరగంట అయింది" అన్నాడు అచ్యుత్.

అప్పటివరకూ గులాబో వాసుదేవ్‌తో మాట్లాడలేదు. ఒక 'టీ' మాత్రం ఇచ్చింది. కస్టమర్‌కి ఇచ్చినట్లు.

"నాకు తెలుసు" మెల్లగా అన్నాడు వాసుదేవ్. అచ్యుత్ జీపులో డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్నాడు.

చాలామంది గులాబో టీ కొట్టుకి వచ్చి బిస్కెట్లు టీలు కొని తాగుతున్నారు. సిగరెట్టు బడ్డీ కొట్టు కూడా బిజీగానే ఉంది. రేబాన్ కళ్ళద్దాల వెనకనించి వాసుదేవ్ క్రీగంట జనాల్నీ, చుట్టుపక్కల షాపుల్నీ జాగ్రత్తగా గమనిస్తున్నాడు. అచ్యుత్ కూడా రియర్ వ్యూ మిర్రర్స్‌లో పరిసరాల్ని గమనిస్తున్నాడు.

ఒక్క క్షణం షాపు ఖాళీ అయింది. "సార్. ఇవాళ ఈ సమయంలో ఇంత రష్ చూసినట్టు ఏనాడూ చూడలా. ఇది టీ టైం కాకపోయినా జనాలు  వచ్చి టీ తాగుతున్నారు. సాయంకాలం ఏదో ఓ టైములో నేనే వచ్చి నాన్నగారిని కలుస్తా" ఏదో వెతుకుతున్నట్టుగా వంగి, వాసుదేవ్‌కి మాత్రమే వినిపించేలా అన్నది గులాబో.

"సరే" అన్నాడు వాసుదేవ్.

ఆ తరవాత మరో పది నిముషాలు అక్కడే కూర్చుని జీపు వైపు నడిచాడు. అచ్యుత్ ఎలర్ట్‌గా జీప్ స్టార్ట్ చేశాడు.

"పరిసరాలు చాలా గంభీరంగా ఉన్నాయి సారూ" అన్నాడు అచ్యుత్.

"అవును" అన్యమనస్కంగా అన్నాడు వాసుదేవ్.

"చాలామందిని చూశాను. వాళ్ళు లోకల్ వాళ్ళలా అనిపించలేదు" ఓ క్షణం వాసుదేవ్‌ని చూసి అన్నాడు అచ్యుత్.

"అవును. వాళ్ళు ఇక్కడి వాళ్ళు కారని తెలుస్తూనే ఉంది. బహుశా అందరి దగ్గరా రుజువులు ఉంటాయి.. ఎక్కడినించి వచ్చారో, ఎక్కడ ఉంటున్నారో తెలపడానికి. కానీ, ఎందు కొచ్చారో మాత్రం వాళ్ళు చెప్పేదికా మనకి తెలీదు. బల్బులు ఒకచోట స్విచ్‌లు ఒకచోట" నిట్టూర్చి అన్నాడు వాసుదేవ్. జీప్ రోడ్డు మీద జర్రున పాకుతోంది.

పైనించి ప్రజర్ చాలా ఎక్కువవుతోంది. ఏం చెప్పాలో తెలీక వాసుదేవ్ మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది. ఎవరో ఒకర్ని పట్టుకుని 'బలిపశువుని' చెయ్యడం అతనికి గిట్టదు.

"ఎక్కడికి వెళ్దాం సార్" అచ్యుత్ అడిగాడు.

"ప్రస్తుతం స్టేషన్‌కి పోనీ" నిట్టూర్చాడు వాసుదేవ్. ఏదో ఓ జవాబు చెప్పక తప్పదు. కిందవాళ్ళమీద పనుల్ని నెట్టేస్తారు పైవాళ్ళు. క్షణాల మీద అరెస్టులు జరగాలంటారు. మళ్ళీ ఇంకా పెద్దవాళ్ళ 'ప్రజర్'కి లొంగిపోయి కిమ్మనకుండా క్రిమినల్స్‌ని వదిలెయ్యమనేదీ వాళ్ళే.

ఒక్క అమాయకుడ్ని పొరబాటున అరెస్టు చేసి జైలుకి పంపితే, ఓ తీవ్రాతి తీవ్రవాదిని మనం త్వరితంగా తయారు చేసినట్లే. అమాయకుడూ, గోవూ ఒకలాంటివే. ఎదురు తిరిగితే ఎవర్నీ లెక్క చెయ్యవు. ఫోన్ మ్రోగింది. కంగారుగా పుండరీకాక్షుని స్వరం వినిపించింది, "వాసూ ఎనిమిది దేవాలయాల్లో ఒకేసారి ఒకే సమయంలో బాంబులు పేల్చారు దుండగులు. దేవాలయాలు దగ్ధం ... నీకు ఇన్ఫర్మేషన్ రాలేదా?" ఆయన స్వరంలో ఆందోళన.

"నేను పాతబస్తీనించి ఇప్పుడే బయల్దేరాను నాన్నా. కనుక్కుంటా?" ఫోన్ పెట్టేశాడు వాసు. వాకీటాకీ మ్రోగుతోంది.

"82 హిందూ దేవాలయాల్లో 16 చర్చిల్లో వృద్ధాశ్రమాల్లో 72 విద్యాసంస్థలలో ఒకేసారి పేలిన బాంబుల విధ్వంసానికి దేశం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇంత పెద్ద ధ్వంస రచన సాగడం ఇప్పుడే మొదటిసారి. కనీ వినీ ఎరుగనంత నష్టం జరిగిందని అంచనా. మృతుల సంఖ్యా, ఆస్తి నష్టమూ ఇప్పట్లో చెప్పలేమని అధికారులూ మంత్రులూ

చేతులెత్తేశారు. దేశంలో పలుప్రాంతాల్లో ఒకేసారి ఇంత విధ్వంసం జరగడం వల్ల ప్రధానీ, రాష్ట్రపతీ, హోం మంత్రీ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్నీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్నీ దుమ్మెత్తిపోస్తున్నాయి."

అటు హైద్రాబాద్‌లో పుండరీకాక్షుని కుటుంబం, తిరుపతిలో TVS గారి ఇంట్లోని సర్వసభ్యులూ, తిరువణ్ణామలైలోని జయ్, రాబీ, సచేత్ బృందమూ, అందరూ ఇదే సమాచారాన్ని టివిలో చూస్తూ, వింటూ ఆశ్చర్యంతో అవాక్కయ్యారు. యజ్ఞప్పగారు సుదీర్ఘంగా నిట్టూర్చి అన్నారు" ఆట మొదలైంది. ఓ పక్క గాంధారి శాపం, మరోపక్క పురానా దిల్లీలో 'షగున్' అని మంత్రసాని పేరెట్టిన 'శకుని ' జన్మం!"

U కి R కి మధ్య భీషణపోరు. క్షిపణుల వర్షానికి  తుత్తునియలవుతున్న  భవనాలు. రోడ్లూ, ఏర్‌పోర్ట్‌లూ పంటపొలాలు నీటి చెరువులూ అన్నీ ధ్వంసమవుతున్నాయి. భవనాల కింద వేలాది మృతులు. తగ్గేదే లేదంటున్న ఇరుపక్షాలు చర్చలకు దారి మూసెయ్యడంతో మూడో ప్రపంచ దేశాలు భయంతో అల్లల్లాడుతున్నాయి. అణ్వాస్త్రాలు ఎవరు ముందు ప్రయోగిస్తారా" అని.

ఎడతెరిపి లేకుండా అన్ని ఛానల్స్‌లోనూ న్యూస్ బులెటన్‌లు పదినిముషాలుకోసారి విడుదలై ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నై.

ఓ మెరుపు తటాల్ని మెరిసింది.

ఓ ఉరుము ఫెళాఫెళా ఉరిమింది.

ఓ సుడిగాలి రివ్వున నింగికెగసింది.

తక్షపురంలోని ముసలిది ఫకాల్న నవ్వింది. ఆ నవ్వు పరమ కఠోరంగా పరమ వికృతంగా ప్రకృతినే ఒణికించేలా ఉంది.

"రా.. మబ్బులా చుట్టుకో.. మాయలా చుట్టుకో.." అంటూ చేతుల్ని పాము పడగల్లా విదిల్చింది ముసల్ది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments